క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శనీశ్వరుడికి శనివారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. అమావాస్య, శనివారం కలిసి రావడంతో ఆలయాల్లో శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు శివాలయాలలో విశేష పూజలు జరిగాయి. ముఖ్యంగా ఈ అమావాస్య నాడు దానాలు చేస్తే పితృదేవతల ఆశీస్సులు లభిస్తాయని ప్రజల నమ్మకం. ఈ నేపథ్యంలో ఆలయాల్లో అర్చకులకు స్వయం పాకం అందజేసేందుకు భక్తులు బారులుతీరారు. ఆలయాల్లో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉపాధి హామీ పనులను గుర్తించాలి

వీరులపాడు: గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను త్వరితగతిన గుర్తించాలని ఏపీవో జనార్దన్ సూచించారు. వీరులపాడులోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లతో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా పనులను గుర్తించి వివరాలను తెలియజేస్తూ, వెంటనే పనులు చేపట్టేందుకు వీలు కలుగుతుందని వివరించారు. ఉపాధిపనులకు వచ్చే కూలీలకు పనికి తగిన వేతనం అందేలా చూడాలని ఆదేశించారు.

కవితా సంకలనం ఆవిష్కరణ



కంచికచర్ల : మండలంలోని పరిటాల క్వారీ చెరువు దిబ్బవద్ద కూలీలతో మల్లయోధ కవితా సంకలన పుస్తకాన్ని కవి రచయిత నీలం సర్వేశ్వరరావు శనివారం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపులు, అత్యాచారాలను నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పుస్తకంలో వివరించినట్లు చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేసి భవిష్యత్ సమాజానికి ఆదర్శం కావాలన్నారు. ఇటువంటి పుస్తకాల పఠనంతో సమాజంలో మంచి మార్పు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సిమెంట్ బల్లలు వితరణ

నందిగామ: పట్టణంలోని నెహ్రూనగర్‌లోగల శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం పలువురు భక్తులు సిమెంట్ బల్లలను వితరణగా అందజేశారు. పట్టణానికి చెందిన రాప్ స్టార్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సిమెంట్ బల్లలను అందజేశారు. భక్తులు సౌకర్యార్థం బల్లలను అందజేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యం పెంచాలి



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యం పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని బెంగళూరుకు చెందిన క్రీస్తు జయంతి కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ మైదూర్ శివరామ్ అన్నారు. ఈ నెల 10 నుంచి శనివారం వరకు నిర్వహించిన జాతీయయ స్థాయి ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ శిక్షణ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యా బోధనలో అధ్యాపకులు చేపట్టాల్సిన మెలకువలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు పరిశోధనల ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం మైదూర్ శివరామ్‌ను సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ సాయిరామ్ పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి కృషి

అనుముల్లంక/కొత్తపల్లి(గంపలగూడెం): పాడి రైతుల శ్రేయస్సు అభివృద్ధి ధ్యేయంగా కృష్ణామిల్క్ యూనియన్ పనిచేస్తోందని ఆ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. గంపలగూడెం మండలం అనుముల్లంక, కొత్తపల్లిపాడి సేకరణ సెంటర్లను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన పాడి రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేపుదాణాతోపాటు యూనియన్ ద్వారా సబ్సిడీపై ఇచ్చేపశుదాణాన్ని వాడటం వల్ల పాలు, ఫ్యాట్‌శాతం పెరుగుతాయని చెప్పారు. జిల్లా యూనియన్ సరఫరా చేసే వీరవల్లి సెమెన్ను గేదెలు ఎదకి వచ్చినప్పుడు చేయించుకోవాలన్నారు. దీని వల్ల మేలుజాతి దూడలు పుడతాయన్నారు. కాల్షియంను సబ్సిడీపై తక్కువ ధరకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఏలికపాముల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు గురించి ఉచిత సూపర్ నాపైర్ గడ్డి కణువులు లాభాల గురించి వివరించారు. కృష్ణామిల్క్ యూనియన్ వినియోగదారుల నుంచి ఆర్జించిన ప్రతి రూపాయి 86 శాతం పాడిరైతుల ప్రయోజనాలకు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తిరువూరు చిల్లింగ్ సెంటర్ మేనేజర్ టి.సాంబశివమూర్తి పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం

ప్రభుత్వ విప్ ఉదయభాను



పెనుగంచిప్రోలులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న విప్ ఉదయభాను



తుర్లపాడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పెనుగంచిప్రోలు: సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వర్తింపజేయాలని నిత్యం పరితపించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో మద్దతు పలికి మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకుందామని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. మండల కేంద్రం పెనుగంచిప్రోలు సచివాలయం –1 పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ప్రజాసమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాగా సాగుతున్నాయన్నారు. చంద్రబాబు పాలన అంతా స్కామ్‌లమయమని విమర్శించారు. జగనన్న పాలనలో పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలన్నీ పారదర్శకంగా అందుతున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాల ఆశాజ్యోతి, రైతు పక్షపాతి సీఎంగా ఉన్నారంటూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను కొనియాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.370 కోట్ల ప్రజాధనం దోచుకున్న చంద్రబాబు జైలు వెళ్తే పలు పార్టీ నాయకులు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, మైనింగ్, పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, వైస్ ఎంపీపీలు గుంటుపల్లి వాసు, కనగాల శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఉపసర్పంచ్ బాడిశ పాపారావు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, తహశీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి..

చందర్లపాడు(నందిగామ టౌన్): మహిళా సాధికారతతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని భావించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అందుకనుగుణంగా పాలన సాగిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలో శనివారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తేదీల క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్ మోహనరావు మాట్లాడుతూ మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నన్ని చర్యలు మరే ముఖ్యమంత్రి తీసుకోలేదన్నారు. మహిళా సంక్షేమంతోపాటు వారి రక్షణకు సైతం ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. అందులో భాగంగానే దిశ యాప్‌ను సైతం రూపొందించారని గుర్తుచేశారు. ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి ఒక్క సమస్యను పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెరమసాని నరసింహారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

వత్సవాయి : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా పంచాయతీ అధికారి జయచంద్రగాంధీ పేర్కొన్నారు. వత్సవాయిలో శనివారం ఆయన పర్యటించారు. గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య చర్యలను పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల్లో స్వయంగా పాల్గొని చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నివాసప్రాంతాలను ప్రతిఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవన్నారు. సైడ్ కాలువల్లో చెత్తా చెదారం వేయకుండా మురుగునీరు పారే విధంగా చూసుకోవాలన్నారు. ప్రధాన రహదారి వెంట హోటళ్లు, కొబ్బరిబొండాలు, చికెన్ షాపులు వాళ్లు చెత్తవేయకుండా చూడాలని పంచాయతీ ఈవో షేక్ ఇమామ్‌సాహెబ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, ఎంపీపీ కొలుసు రమాదేవి, భూక్యా రాజానాయక్ పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న డీపీవో జయచంద్ర, సర్పంచ్ సీతమ్మ

అభివృద్ధి పథంలో ముండ్లపాడు

- రూ.4కోట్లతో అభివృద్ధి పనులు..
- చక్కటి వసతులతో పాఠశాలలు
- పూర్తయిన సీసీరోడ్ల నిర్మాణం
- తుదిదశలో సచివాలయం పనులు



నిర్మాణం పూర్తయిన వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సొసైటీ భవనం



తుదిదశకు చేరుకున్న సచివాలయం పనులు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని ముండ్లపాడు గ్రామం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. కోట్లాది రూపాయలతో చేపట్టిన పనులన్నీ శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని పనులు పూర్తికాగా, మరికొన్ని అభివృద్ధి పనులు తుదిదశకు చేరాయి.

పూర్తయిన విలేజ్ క్లీనిక్..

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ కింద ముండ్లపాడు గ్రామానికి రూ.21లక్షలు మంజూరయ్యాయి. ప్రధానరహదారి పక్కన పెనుగంచిప్రోలు–విజయవాడ వెళ్లే దారిలో చేపట్టిన విలేజ్ క్లీనిక్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.

రైతులు, ప్రజల సౌకర్యార్థం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా పెట్రోల్ బంక్ నిర్మాణం కూడా చేపట్టారు.

రూ.45లక్షలతో సచివాలయ భవనం..

రూ.45లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయ భవన నిర్మాణ పనులు కూడా పూర్తి కావస్తున్నాయి. రూ.38లక్షలతో చేపట్టిన నూతన ప్రాథమిక సహకార పరపతి సంఘం భవనం పనులు తుదిదశకు చేరుకున్నాయి.

రూ.1.40కోట్లతో సీసీరోడ్లు..

గ్రామంలో ప్రధానంగా రూ.1.40 కోట్లతో సీసీ రోడ్లను నిర్మించారు. దీంతో ప్రధాన రహదారులన్నీ మొత్తం నూతన శోభను సంతరించుకున్నాయి. నాడు–నేడు పథకంలో భాగంగా గ్రామంలోని ఓ జెడ్పీ ఉన్నత పాఠశాల, రెండు ప్రాథమిక పాఠశాలలను రూ.1.30కోట్లతో అభివృద్ధి చేశారు. సుమారు 20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. సొంతస్థలం ఉన్న 40మందికి గృహనిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం ఆర్థికసాయం అందించడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన రెడ్డి పాలనలో, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సహకారంతోనే ముండ్లపాడు గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మునుపెన్నడూ లేని అభివృద్ధి...



కోట్లాది రూపాయలతో నిర్మించిన పెట్రోల్ బంక్, సొసైటీ భవనం, సచివాలయం, హెల్త్ క్లీనిక్ భవనాలను త్వరలో ప్రారంభిస్తాం. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం మరువలేనిది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టగలిగాం. పల్లెలను ప్రగతిపథంలో పరుగుపెట్టిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

– గూడపాటి లావణ్య, సర్పంచ్

నేటి నుంచి దసరా ఉత్సవాలు



శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో అమ్మవారికి ప్రతిరోజూ కుంకుమ పూజ నిర్వహిస్తామని వివరించారు. ఆదివారం ఉదయం గం.8.49 నిముషాలకు కలశ స్థాపనతో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభవుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 20వ తేదీ మూలనక్షత్రం సందర్భంగా సరస్వతీ పూజ, 22న దుర్గాష్టమి, సాయంత్రం మహర్ణమి కూష్మాండ బలిదానం, ఉద్వాసన, చండీహోమం ఉంటాయన్నారు. 23న విజయదశమి సాయంత్రం ఆరున్నర గంటలకు శమీపూజ, 25న అమ్మవారి విగ్రహం నిమజ్జనోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఈవో కోరారు.

పర్యాటక కేంద్రంగా జగ్గయ్యపేట ఊరచెరువు



ఊరచెరువు పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని ఊర చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. చెరువు అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో పయనింపజేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అందులోభాగంగా జగ్గయ్యపేట పర్యాటక కేంద్రంగా చెరువును అభివృద్ధి పరుస్తున్నామన్నారు. ఇప్పటికే చెరువు చుట్టూ ప్రహరీ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ తదితర నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఉదయానే వాకింగ్ చేసే వారి సౌకర్యార్థం, సువిశాల వాకింగ్ ట్రాక్ నిర్మించాలంటూ కంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి, అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ఊరచెరువును ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేంద్ర, వేముల విజయ్, యూత్ సభ్యులు దుర్గా తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 'అమ్రితసాయి' విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శశిధర్, అకడమిక్ డైరెక్టర్ చిరంజీవి, అధ్యాపకులు

పరిటాల(కంచికచర్ల) : మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం క్యాంపస్ సెలక్షన్స్ జరిగాయి.హైదరాబాద్‌కు చెందిన ట్రూఫైలర్ ప్రైవేట్ లిమిటెడ్‌కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో బీటెక్ ఫైనలియర్ విద్యార్థులు పాల్గొని విశేషప్రతిభను కనబరిచారు. మొత్తం 24మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ. 2లక్షలు అందిస్తారని వివరించారు. 2023–24 విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు తమ కళాశాల నుంచి 108మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఒక్కొక్కరికి వార్షిక వేతనం రూ.12లక్షల వరకు ఉందని వివరించారు. తమ కళాశాలలో నాణ్యమైన సాంకేతిక విద్యనందించడంతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించేలా మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ తోపాటు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామ్మోహన్‌రావు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ వి.రామారావు అభినందించారు.

చోరీలకు తావులేకుండా పటిష్ట చర్యలు : ఎస్ఐ



ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం

కంచికచర్ల : మండలంలో దొంగతనాలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ పీవీఎస్ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయదశమి సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఆ సమాచారాన్ని స్థానిక పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చినవారి గృహాలు ఉన్న ప్రాంతాల్లో మరింత పటిష్టంగా భద్రతాచర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు మరిచిపోకుండా ఇంటికి తాళాలు వేసుకోవాలన్నారు. విలువైన బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో రాత్రి సమయంలో కొత్తవ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు ఆలయాలు ముస్తాబు



బ్రాహ్మణబజారులోని వెండి దేవాలయంలో ముస్తాబవుతున్న మండపం



తెలంగాణ నుంచి తీసుకువచ్చిన కనకదుర్గ అమ్మవారి విగ్రహం

జగ్గయ్యపేట : నేటి నుంచి నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు అయ్యాయి. దసరా పండగను పురస్కరించుకుని గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాల ఏర్పాటుకు మంటపాలు ఏర్పాటు చేస్తున్నారు. వినాయక విగ్రహాల మాదిరిగా ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న మండపాల పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని గౌరవరం, జయంతిపురం, అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్‌పేట, బండిపాలెం, వేదాద్రి గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. అంతే కాకుండా సమీపంలోని తెలంగాణ ప్రాంతాల నుంచి అమ్మవారి విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. పట్టణంలోని సకాశి బజారులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం, బ్రాహ్మణబజారులోని వెండి దేవాలయంతోపాటు దుర్గాపురంలోని దుర్గమ్మ ఆలయంలో కూడా దసరా మహోత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

కోళ్ల వ్యర్థాల రవాణా వ్యాన్ సీజ్

ముసునూరు: పోలీసుల కళ్లు గప్పి కోళ్ల వ్యర్థాలను అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, వాహనాన్ని సీజ్ చేసి ముసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు శనివారం తెలిపారు. హైదరాబాద్ నుంచి ఏలూరు ప్రాంతంలోని పెదపాడు మండలంలోని వడ్డీగూడెం చెరువుల్లో చేపలకు మేతగా తరలిస్తున్న కోళ్ల వ్యర్థాల లోడు వాహనాన్ని శనివారం వాహన తనిఖీల్లో భాగంగా ముసునూరు ఆంజనేయస్వామి కూడలి సమీపంలో బోర్డు బల్ల వద్ద అడ్డుకున్నామని పేర్కొన్నారు. వ్యాన్‌లో ఐదు టన్నుల కోళ్ల వ్యర్థాలతో ప్లాస్టిక్ సంచులు ఉన్నాయని తెలిపారు. డ్రైవర్ ఘంటసాల ఎబ్బేసు, క్లీనర్ నబగిరి రామాంజనేయులును అదుపులోకి తీసుకుని, వ్యానుతో సహా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్, క్లీనర్, వాహన యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శిక్షణాంశాలను బోధనలో అన్వయించాలి

ఆగిరిపల్లి: శిక్షణలో పొందిన అంశాలను విద్యా బోధనలో అన్వయించడం ద్వారా శిక్షణ లక్ష్యాలను సాధించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దవచ్చని ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ జీ మహేశ్వరరావు అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ ప్యారడైజ్ స్కూల్లో ఆరు రోజులుగా నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ వల్ల ఉపాధ్యాయుల్లో మరింత బోధనా సామర్థ్యాలు పెంపొందుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ఎన్నో విప్లవాత్మకమైన చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కూడా తమ వంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం హీల్ సంస్థ ఆధ్వర్యంలోని అంధుల పాఠశాల, కృత్రిమ అవయవ కేంద్రం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్లను సందర్శించి బాలబాలికలతో ముచ్చటించారు. డీపీఈటీ పర్యవేక్షకులు లలితమోహన్, హరికిరణ్, శిక్షణాప్రాంగణ బాధ్యులు బి.సురేష్‌కుమార్, ఏఎస్ఓ అశోక్, జీసీడీఓ శాంతి, శిక్షణ కార్యక్రమ ఇన్‌చార్జి డీవీవీఆర్ పలువురు కీ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దసరా ఉత్సవాల ఏర్పాట్లను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం పరిశీలించారు. మంత్రితో పాటు పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, సీపీ టి.కె.రాణా, డీసీపీ విశాల్ గున్ని, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఫెస్టివల్ ఆఫీసర్ ఆజాద్, ఈవో కేఎస్ రామారావులతో పాటు పాలక మండలి సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు. సీతమ్మ వారి పాదాల వద్ద స్నానఘాట్‌ను పరిశీలించిన మంత్రి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కెనాల్‌రోడ్డులోని క్యూలైన్లు, కనకదుర్గనగర్‌లో ప్రసాదాల కౌంటర్లు పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామన్నారు. కొండ రాళ్లు విరిగిపడటంతో క్యూలైన్‌లో కొన్ని మార్పులు చేశామన్నారు. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, క్యూలైన్ మార్గంలో ప్రత్యేకంగా టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. 3500 మంది పోలీసులు, 300 దేవస్థాన సిబ్బందితోపాటు డెప్యూటేషన్ సిబ్బంది ఉత్సవాల విధుల్లో పాల్గొంటారని వివరించారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యను వేధిస్తున్న భర్తపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వైఎస్సార్ కాలనీకి చెందిన కడాలి దుర్గ ఆటో డ్రైవర్ శివప్రసాద్‌ను ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. కొంతకాలంగా మద్యానికి బానిసైన శివ ప్రసాద్ భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో ఆమె అతని నుంచి విడిపోయి పుట్టింటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం దుర్గ పనికి వెళ్లేందుకు వైఎస్సార్ కాలనీ నుంచి సితార సెంటర్‌కు చేరుకుంది. అప్పటికే అక్కడ ఉన్న ఆమె భర్త శివ బలవంతంగా ఆటో ఎక్కించుకుని బొబ్ ఏజెన్సీకి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై దాడి చేయగా తప్పించుకుని భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.